క్లుప్తంగా

ఆ హామీ విరమించుకోవాలి

కపిలేశ్వరపురం: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామంటూ హామీ ఇవ్వడాన్ని విరమించుకోవాలని రాజకీయ పార్టీలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ధూళి జయరాజు కోరారు. ఈ మేరకు ఈ నెల 7న జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఉచిత ప్రయాణ హామీని నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కపిలేశ్వరపురం మండలం అంగర, మండపేట మండలం ద్వారపూడిలలో శనివారం ఆటో కార్మికులతో సన్నాహక సమావేశాలను నిర్వహించారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వెంకటేశ్వరరావు



సీనియర్ సివిల్ జడ్జిని కలసిన బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ఇతర న్యాయవాదులు

రామచంద్రపురం: సీనియర్ సివిల్ జడ్జిగా ఒ.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్‌ల ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. బెంచ్, బార్‌ల మధ్య మంచి సంబంధాలు నెలకొల్పాలని జడ్జి న్యాయవాదులను కోరారు. అనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినిపే వెంకట రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు జడ్జిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ చిన్నం వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ పెంకే వెంకట్రావు మృతి



కపిలేశ్వరపురం: టేకి– 2 ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెంకే వీర వెంకట్రావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కాంగ్రెస్ హయాంలో ఎంపీటీసీ సభ్యుడిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్య సంతాపం వ్యక్తం చేశారు.

అయోధ్య అక్షతల వితరణ



అన్నాయిపేటలో అయోధ్య రాముని అక్షతల వితరణ చేస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం పురస్కరించుకుని రాముల వారి అక్షతల వితరణ మండలంలోని అన్నాయిపేటలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, గ్రామ పెద్దలు ఆకేటి భీమశంకరం, పెమ్మిరెడ్డి నాని, కొప్పాల వీరబాబు, యాళ్ల బుజ్జి, ఉంగరాల కోటబాబు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు శనివారం నిరసన తెలిపారు. వారు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి మాట్లాడుతూ న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత యువకుడికి ఆర్థిక సాయం

కొత్తపేట: కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న మట్టపర్తి వెంకటేష్ వైద్యానికి కముజువారిపాలెం గ్రామస్తులు రూ.21 వేలు అందజేశారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు మట్టపర్తివారిపాలేనికి చెందిన మట్టపర్తి రాంబాబు కుమారుడు వెంకటేష్‌కు రెండు కిడ్నీలు దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యానికి రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తుంది. నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత యువకుని తండ్రి రాంబాబుకు అంత ఆర్థిక స్తోమత లేక అయోమయ పరిస్థితికి లోనవుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న కముజువారిపాలెం గ్రామ పెద్దలు రూ.21 వేలు సేకరించి వెంకటేష్ వైద్యానికి సాయంగా అందజేశారు.

బ్యాంక్ ఖాతా తెరుస్తున్నారా!

ఖాతాల్లో తేడాలు తెలుసుకోండి



రామచంద్రపురం రూరల్: నగదు రహిత సేవల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఏ రోజూ బ్యాంకు మెట్లు ఎక్కని వారు సైతం నేడు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నగదు రహిత లావాదేవీల వైపు ప్రజలను ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి. దీంతో భవిష్యత్ లావాదేవీలన్నింటికీ బ్యాంకు ఖాతాలే కీలకం కానున్నాయి. ప్రతి వ్యక్తి కచ్చితంగా ఏదైనా బ్యాంకులో ఖాతా కలిగి ఉండాల్సిన పరిస్థితిలో బ్యాంకు ఖాతాల్లో రకాలు, వాటి ఉపయోగాలు తెలుసుకుంటే తమకు తగిన ఖాతాను ఎంపిక చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ప్రతి వ్యక్తి తన అవసరానికి తగినట్లు ఎన్ని బ్యాంకుల్లోనైనా ఖాతాలు ప్రారంభించవచ్చు. కానీ ఆ ఖాతా నిర్వహణకు సంబంధించిన నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి.

సేవింగ్స్ ఖాతా

వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబం, స్వచ్ఛంద సంస్థలకు మాత్రమే సేవింగ్స్ ఖాతా తెరిచేందుకు అనుమతి ఉంది. వ్యక్తిగతంగా, లేక మరొకరి భాగస్వామ్యంతో కలసి ఈ సేవింగ్ ఖాతా తెరవవచ్చు. దీనిని సవ్యంగా నిర్వహించేందుకు, లేదా వారి తరఫున మరొకరు నిర్వహించేందుకు పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడానికి కూడా అనుమతి ఉంది. కనీస నగదు నిల్వను అన్ని వేళలా ఉంచాలి. సేవింగ్ ఖాతాలో నిల్వ ఉన్న నగదు మొత్తానికి వివిధ బ్యాంకులు 4 నుంచి 6 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్నాయి. ఖాతాతో పాటు ఏటీఎం కం డెబిట్‌కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, చెక్‌బుక్ సేవలు పొందవచ్చు. వీటితో పాటు ఆయా బ్యాంకులు వ్యక్తిగత బీమా, లాకర్ సదుపాయాలను అందిస్తున్నాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు ఉచిత ఫోన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇంటి ముంగిటకే బ్యాంకింగ్, కోరినన్ని చెక్కులు, ఉచిత డీడీలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నాయి.

కరెంట్ ఖాతా

వ్యాపారస్తులు, రోజువారీ నగదు లావాదేవీలు నిర్వహించే వారికి కరెంట్ ఖాతా అనువుగా ఉంటుంది. నగదు డిపాజిట్, ఉపసంహరణలపై పరిమితి ఉండదు. ఎంత మొత్తమైనా డిపాజిట్‌తో పాటు విత్‌డ్రా చేసుకోవచ్చు. చెక్‌బుక్‌ల విషయంలోనూ పరిమితి ఉండదు. రోజువారీ లావాదేవీలు, ఆయా ఖాతాదారుడి చరిత్ర ఆధారంగా బ్యాంకులు ఓడీ సౌకర్యం కల్పిస్తున్నాయి. కరెంట్ ఖాతాలో నిల్వ ఉండే నగదుకు బ్యాంకులు వడ్డీ చెల్లించవు.

వేతన ఖాతా

వేతన ఖాతాలను ఎవరికి వారు వ్యక్తిగతంగా తీసుకునేందుకు వీలు లేదు. కంపెనీలు, సంస్థలే బ్యాంకులతో ఒప్పందం చేసుకుని తమ ఉద్యోగుల పేరిట ఖాతాలు తెరుస్తాయి. ఈ ఖాతాల ద్వారా ఉద్యోగులకు పలు ప్రయోజనాలు కల్పిస్తున్నాయి. వేతన ఖాతాల్లోనే ప్రీమియం, ప్రయారిటీ, శాలరీ, శాలరీ ప్లస్, ప్లాటినం ఇలా రకరకాల పేర్లతో వివిధ అదనపు ప్రయోజనాలతో అందిస్తున్నాయి.

ఘనంగా ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం



పాణింగపల్లిలో సొసైటీ భవనాన్ని ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో శనివారం పలు ప్రభుత్వ భవనాలను ప్రజా ప్రతినిధులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాణింగపల్లిలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీంతో పాటు గ్రామంలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. దీంతో పాటు సత్యవాడలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లనూ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నేటి నుంచి ప్రభుత్వ భవనాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరాంప్రసాద్, సర్పంచ్‌లు చీకట్ల సునీత, సూర్యకళావతి, పార్టీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు, వైస్ ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల చినబాబు, కోటిపల్లి సొసైటీ అధ్యక్షులు సాదా వెంగళరావు, గృహసారథులు, కన్వీనర్లు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి



ఎంపీ యూపీ స్కూల్లో భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయాలు విద్యార్థులకు తెలిసేలా భోగి మంటలు, కోలాటం, గొబ్బిళ్లు, ముగ్గుల పోటీలు, గాలిపటాలు, నృత్యాలతో పాఠశాలలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, వైస్ సర్పంచ్ వల్లు శివ, ఉపాధ్యాయులు పద్మమణి, సూర్యకుమారి, శ్రీనివాస్, భాస్కరలక్ష్మి, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థకు చెల్లుచీటీ



తణుకువాడలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: గత తెలుగుదేశం హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెల్లుచీటి పలికారని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని తణుకువాడ, దేగలపేట, శలపాక గ్రామాల్లో శనివారం గడప గడపకూ పర్యటించి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గవిభేదాలకు తావివ్వకుండా వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ నేరుగా అందిస్తున్నారన్నారు.

సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలు ప్రతి పనికి జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరగనవసరం లేకుండా ప్రభుత్వ సేవలను స్థానికంగా అందుబాటులోకి తెచ్చారన్నారు. కుల మతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నారని భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ దడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మంగతాయారు

రాయవరం: టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించాలని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు విద్యార్థులకు సూచించారు. జిల్లా పరిషత్ ద్వారా సరఫరా అయిన స్టడీ మెటీరియల్‌ను శనివారం సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నేత నల్లమిల్లి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ రోడ్డుకు మోక్షం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక వద్ద కాటన్ బ్యారేజీపై రోడ్డు ఛిద్రమై వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బ్రిడ్జి భాగం కాకుండా మిగిలిన భాగం రోడ్డు నిర్మించారు. కొన్ని సాంకేతిక ఇబ్బందుల దృష్ట్యా బ్రిడ్జిపై రోడ్డు నిర్మించడం వీలు కాలేదు. దానిని కూడా అధిగమించి కలెక్టర్‌తో రూ.20 లక్షలు మంజూరు చేయించి శనివారం రోడ్డు పనులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బొబ్బర్లంక బ్యారేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభల తీర్థం నిర్వహణపై ఆర్డీఓ సమీక్ష



జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఈ నెల 16న నిర్వహించే ప్రభల తీర్థం నిర్వహణపై కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి శనివారం సమీక్షించారు. గంగలకుర్రు పంచాయతీలో డీటీ ఎస్.నాగపద్మాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకాదశ రుద్రులు ఉత్సవ కమిటీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ సూచించారు. ప్రభల తీర్థం జరిగే ప్రాంతంలో మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య ఏర్పాట్లకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తికి ఆర్డీఓ సూచించారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: బాలికలు విద్యాభ్యాసంలో ముందడుగు వేసేలా ప్రతి ఒక్కరూ వారిని ప్రోత్సహించాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఈ ఏడాది కాజులూరు ప్రభుత్వ కళాశాల నుంచి కేతా వేణు ఎంపీసీలో 470కి 462 మార్కులు, ద్రోణాద్రి హేమలక్ష్మి బైపీసీలో 440కి 383 మార్కులు సాధించి జిల్లాలో గుర్తింపు సాధించారు. ఈ మేరకు బాలికా విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు చెందిన బళ్ల నారాయణమూర్తి రూ.10000 ఉపకారవేతనాలు పంపించగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో బాలికలు పరీక్షల్లో మార్కులు సాధించడంతో పాటు, ఉన్నత విద్యను అభ్యసించటంలోనూ బాలురతో పోటీ పడి ముందంజలో ఉంటున్నారన్నారు. సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. పేద విద్యార్థుల ఆర్థిక సహకారానికి కృషి చేస్తున్న కళాశాల లైబ్రేరియన్ వి.భీమేశ్వరరావుని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు సింగంపల్లి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల అప్పగింతకు చర్యలు

పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి



మండపేటలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న దుర్గారాణి, రాజుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట 20వ వార్డు వైఎస్సార్ కాలనీలోని 1,300 టిడ్కో ప్లాట్లను మొదటి విడతలో భాగంగా ఈనెల 25 నాటికి లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజబాబు తెలిపారు. ప్లాట్లను సంబంధిత అధికారులతో కలిసి శనివారం వారు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ మిగిలిన ప్లాట్లను ఫిబ్రవరి నెల చివర వారంలో రెండో విడతగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రాజుబాబు మాట్లాడుతూ లబ్ధిదారుల సౌకర్యార్థం ప్లాట్లను త్వరితిగతిని పూర్తిచేసి అందజేస్తామన్నారు. ప్లాట్ల అందజేతలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చూపిన చొరవను పలువురు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు ప్రశంసించారు. ప్లాట్లను పరిశీలించిన వారిలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, గ్రంధి శ్రీనివాసు, మెండు బాపిరాజు, పిల్లి శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, మున్సిపల్ అధికారులు బి. శ్రీనివాసు, పి.రాజు, మోహన్, పాల్గొన్నారు.

ఆటలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి



అద్దంకివారిలంకలో క్రీడాకారులకు జ్ఞాపికలను అందిస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: ఆటలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఎమ్మెల్సీ తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని అద్దంకివారిలంకలో 'ఆడుదాం ఆంధ్ర' గ్రామ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రికెట్, కబడ్డీ పోటీల్లో విజేత జట్లకు జ్ఞాపికలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సఖిలే సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొలకోటి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, వీఆర్వో స్వామి నాయుడు పాల్గొన్నారు.

పంట నమోదుకు రైతులు త్వరపడాలి



మండలంలోని వి.సావరంలో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: రబీ పంట నమోదును క్షేత్ర స్థాయిలో శనివారం వి.సావరం గ్రామంలో ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 2,700 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. పంట వేసిన ప్రతి రైతు కూడా పంట నమోదు చేయించుకోవాలని, రైతులకు విజ్ఞప్తి చేశామన్నారు. ఇందుకోసం రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జెరాక్స్ తీసుకుని సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అలాగే పంట నమోదు చేయించుకున్న అనంతరం రైతులు ఈకేవైసీ కూడా వెంటనే తీసుకోవాలన్నారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తయితేనే పంట నమోదు పూర్తయినట్టుగా రైతులు భావించాలన్నారు.

సామాన్యుల శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం

పెంచిన పింఛన్ల పంపిణీ



కేదారిలంకలో పింఛన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ



పాలతోడులో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీపీఓ, ఎంపీపీ, సర్పంచ్

కపిలేశ్వరపురం (మండపేట): సామాన్యుల శ్రేయస్సే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు అన్నారు. పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం రూ.3వేలకు పెంచిన పింఛన్లను వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ళ నారయ్యబాబు, విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్ బాబా, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, జేసీఎస్ టౌన్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, టీపీఓ మనిరామ్, కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాలతోడులో...

మండపేట రూరల్ మండలం పాలతోడులో రూ.3వేలకు పెంచిన పింఛన్లను ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కరుపూడి రాంబాబు, అరవరాజు, తుమ్మా వీరబాబు, విశ్వనాథం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐదం రాజు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కేదారివారిలంక, అద్దంకివారిలంకలలో..

కపిలేశ్వరపురం: పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో యావత్ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో శనివారం నిర్వహించిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అద్దంకివారిలంకలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, కేదారిలంకలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి చేతుల మీదుగా లబ్ధిదారులకు పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. కేదారిలంకలో నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్.నరసింహారావు, వీఆర్వో వి.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



ఆస్పత్రిలో నాగేశ్వరరావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ విశాలాక్షి

రాయవరం: మండలంలోని కురకాళ్లపల్లికి చెందిన సాదే నాగేశ్వరరావు అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్నాడు. నాగేశ్వరరావుకు ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నారు. కాగా ఆస్పత్రిలో ఉన్న నాగేశ్వరరావుకు వలంటీర్ సూరంపూడి విశాలాక్షి పెరిగిన పింఛన్ రూ.3 వేలను శనివారం అందజేసింది. మానవత్వం చాటుకున్న వలంటీర్‌ను సర్పంచ్ పిల్లి శారద తదితరులు అభినందించారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ



బ్యాడ్మింటన్ బ్యాట్లు పొందిన విద్యార్థులతో వైఎస్సార్ సీపీ నేత గోవిందు

రాయవరం: చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పాలిక రాఘవ, వైఎస్సార్ సీపీ నేత పాలిక గోవిందు దంపతుల సౌజన్యంతో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని దాసరి మధులత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చింది. క్రీడల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 10 బాల్ బ్యాడ్మింటన్ బ్యాట్లు, 12 బాల్స్‌ను వైఎస్సార్ సీపీ నేత గోవిందు ద్వారా విద్యార్థినులకు అందజేశారు. అలాగే మధులత ఫైబర్ బ్యాట్ కొనుగోలు చేసుకునేందుకు గోవిందు, పంచాయతీ సిబ్బంది కలిసి రూ.3,500 అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పీడీ దుర్గాదేవి పాల్గొన్నారు.